క్లుప్తంగా

విద్యార్థులకు బహుమతుల అందజేత



బహుమతులు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు శాంతినగర్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో శనివారం ఎస్‌ఎస్ స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్‌కు సంబంధించిన కార్యక్రమం నిర్వహించారు. దీనిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని డీఆర్‌డీవో శాస్త్రవేత్త డాక్టర్ సూరిబాబు అన్నారు. పాఠశాల హెచ్‌ఎం సువర్ణ, శంకర్,ఈశ్వరరావు, రాణి, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబ హుండీ ఆదాయం రూ. 18.36 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు

కంచరపాలెం: జ్ఞానాపురంలో గల ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో శనివారం దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకులు అమ్మవారి హుండీల ఆదాయ లెక్కింపు నిర్వహించారు. 52 రోజులకుగాను అమ్మవారికి ముడుపులు, ప్రత్యేక దర్శనాల ద్వారా రూ. 18,36,316 వచ్చినట్లు ఈవో డీవీఎస్ సురేష్‌బాబా తెలిపారు. పెందుర్తి వేంకటేశ్వర స్వామి ఆలయ ఈవో నీలిమ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. కంచరపాలెం పోలీస్ సిబ్బంది, కమిటీ సభ్యులు, దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీవారి స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

వెలగని వీధి దీపాలు



కాకరలోవలో వీధిలైటు లేని స్తంభం

సింధియా : జీవీఎంసీ 63వ వార్డు పరిధి కాకరలోవలో వీధిలైట్లు లేకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. చీకటి పడితే విషసర్పాల సంచారం అధికంగా ఉంటోందని తెలిపారు. దీంతో సాయంత్రమైతే వీధుల్లో ప్రయాణించాలంటేనే భయవేస్తోందని పేర్కొన్నారు. కుక్కలు వెంటపడి చిన్నారులను గాయపరుస్తున్నాయన్నారు. సమస్యపై విద్యుత్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోయిందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

నేడు ఉపకార వేతనాలు, ప్రోత్సాహకాల అందజేత

విశాఖ విద్య: ఈస్టర్న్ నేవల్ కమాండ్ కేటీబీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించనున్నట్టు అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షుడు బత్తుల చిరంజీవి తెలిపారు. శనివారం వారు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎన్‌ఏడీ జంక్షన్‌లోని ఈఎన్ సీ కేటీబీ కళాక్షేత్రంలో ఆదివారం ఉదయం 9 గంటలచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. 2023–24 విద్యా సంవత్సరంలో పదోతరగతి నుంచి ఇంజినీరింగ్ , నీట్ రాసే విద్యార్థుల వరకు ఉపకార వేతనాలకు దరఖాస్తులు ఆహ్వానించామన్నారు. అర్హులైన విద్యార్థులను ఎంపిక చేసినట్టు చెప్పారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, పినాకల్ ఆస్పత్రి చైర్మన్ రాగం కిషోర్ బాబు తదితరులు విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తారని చెప్పారు.

సిండికేట్ దందా!

- దోచుకోవడమే ధ్యేయంగా మద్యం సిండికేట్
- విచ్చలవిడిగా బెల్ట్ షాపులు
- లైసెన్స్ ఉందనే పేరుతో రోజుకో చోట మద్యం దుకాణం



ఇదే చోట నిర్వహించిన మద్యం దుకాణం తరలించారు



కొత్తపాలెంలో మద్యం దుకాణానికి గ్రిల్స్ ఏర్పాటు చేయకుండానే అమ్మకాలు

విశాఖ విద్య: పశ్చిమ నియోజకవర్గంలో బెల్ట్‌షాపులు బార్లా తెరుచుకుంటున్నాయి. మెజార్టీ షాపులు కూటమి నేతలే చేజిక్కించుకోవడంతో వారి కనుసన్నల్లోనే బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారనే ప్రచారం సాగుతోంది. కూటమిగా ఏర్పడి దందాకు తెరలేపారు.

ఇదీ పరిస్థితి

గోపాలపట్నం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోకి వచ్చే ఏరియాలో 18 బార్లు ఉన్నాయి. ఇటీవల నిర్వహించిన లాటరీలో కొత్తగా 13 వైన్ షాపుల ఏర్పాటుకు ఎక్సైజ్ అధికారులు అనుమతులు ఇచ్చారు. నియోజకవర్గంలో పారిశ్రామిక ప్రాంతం ఎక్కువగా ఉండడంతో పోటీ పడి మరీ మద్యం దుకాణాలు దక్కించుకున్నారు. అయితే కొన్ని షాపులు కూటమేతర వ్యాపారులకు దక్కాయి. అయితే వారి వ్యాపారం సవ్యంగా సాగడం కోసం కూటమి నేతలతో జతకట్టక తప్పలేదని లైసెన్సులు దక్కించుకొని కొంత మంది చెబుతున్నారు. ఈ పరిణామాలతో సిండికేట్‌గా ఏర్పడిన దుకాణ యజమానులు ధనార్జనే ధ్యేయంగా దందాకు తెరలేపినట్లు జోరుగా ప్రచారం సాగుతోంది.

అంతా వారిష్టమే

జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం సెంటర్‌లో రెండు మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. గతంలో ప్రభుత్వ దుకాణం నిర్వహించిన భవనంలో ఒక దుకాణం, దానికి సమీపంలోనే మరో దుకాణం ప్రారంభించారు. ప్రభుత్వ దుకాణం నిర్వహించిన భవనంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని వారం రోజుల్లోనే అక్కడ నుంచి బాజీ జంక్షన్ బీఆర్‌టీఎస్ రోడ్‌లోకి మార్చేశారు. దీని వెనుక వేరే కథ ఉన్నట్లు గుస గుసలు వినపడుతున్నాయి. మద్యం దుకాణ నిర్వాహకులు 'కూటమి'గా చేసుకున్న ఒప్పందాల నేపథ్యంలోనే ఒక దుకాణం తరలిపోయిందని పలువురు అంటున్నారు.

కొత్తపాలెంలో మందుబాబుల హడావుడి

కొత్తపాలెం రైల్వే అండర్‌పాస్ దాటిన తర్వాత మందుబాబుల హడావుడి పెరిగింది. గతంలో డ్రంకన్ డ్రైవ్ చేపట్టిన పోలీసులు ప్రస్తుతం ఆ దారిలో డ్రంక్‌డ్రైవ్ తనిఖీలు చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొత్తపాలెం సెంటర్‌లో మద్యం దుకాణం ముందు రహదారిని పూర్తిగా ఆక్రమించేసి మందుబాబులు వాహనాలు పార్కింగ్ చేస్తున్నా అటువైపు కన్నెత్తి చూడకపోవడంలో



మలుపులోనే మద్యం సేవిస్తున్న మందు బాబులు

ఆంతర్యమేమిటని ప్రజానీకం ప్రశ్నిస్తున్నారు.

బ్యాక్ డోర్ విక్రయాలు షురూ

కొత్తమద్యం పాలసీ వచ్చిన తర్వాత మద్యం విక్రయాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతుంది. బ్యాక్ డోర్ విక్రయాలు షురూ అయ్యాయి. ఎన్‌ఏడీ ఫ్లైఓవర్ వద్ద గల ఓ బార్‌లో ఉదయం 6గంటల నుంచే వెనుక వైపు మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని పలువురు చెబుతున్నారు.

నిబంధనలకు పాతర

మద్యం దుకాణం నిర్వహణకు లైసెన్స్ దక్కించుకున్న వారు కచ్చితంగా నిబంధనలు పాటించాలి. దుకాణంలోకి మందు బాబులు రాకుండా గ్రిల్స్ ఏర్పాటు చేయాలి. అదే విధంగా ప్రతీ మద్యం దుకాణం వద్ద ఎంఆర్‌పీ ధరల బోర్డు పెట్టాలి. కానీ నియోజకవర్గంలోని చాలా వైన్ షాపుల వద్ద ఇలాంటివేమీ కనిపించడం లేదు.

బెల్ట్ షాపులకు బేరసారాలు

లాభార్జనే లక్ష్యంగా 'కూటమి'గా ఏర్పడిన మద్యం వ్యాపారులు జనాన్ని మద్యం మత్తులో ముంచేందుకు అనువైన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వైన్ షాపులకు అనుబంధంగా బెల్ట్ షాపులు పెట్టుకునేందుకు ముందుకొచ్చే వారికి ఆఫర్లు ప్రకటిస్తున్నారు. బెల్ట్ షాపుల గురించి ఎవరైనా ప్రశ్నించినా తాము చూసుకుంటామనే భరోసా కల్పిస్తున్నారు. యల్లపువానిపాలెంలో బెల్ట్‌షాపు వద్దని ఎదురించిన కొంతమందిపై దాడులకు సైతం పాల్పడ్డారని సమాచారం. ఈ పంచాయితీ గోపాలపట్నం పోలీసు స్టేషన్ వరకు వచ్చినా బయటకు పొక్కకుండా కూటమి నేతలు మేనేజ్ చేసినట్లుగా తెలుస్తోంది.

మళ్ల సత్యంకు పరామర్శ



సత్యంను పరామర్శిస్తున్న శ్రీధర్

విశాఖ విద్య: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెంలో ప్రముఖ పారిశ్రామికవేత్త మళ్ల సత్యంను శనివారం నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పరామర్శించారు. అనారోగ్యంతో సత్యం బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న శ్రీధర్ ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాక్షించారు.

ముగిసిన విజిలెన్స్ వారోత్సవాలు



బహుమతులు అందిస్తున్న సీఎండీ ఖత్రి

సింధియా: ఉద్యోగులు సంస్థ నిర్దేశించిన నియమ నిబంధనలకు లోబడి పని చేయాలని హిందూస్థాన్ షిప్‌యార్డ్ సీఎండీ హేమంత్ ఖత్రి సూచించారు. షిప్‌యార్డ్‌లో నిర్వహించిన విజిలెన్స్ అవేర్‌నెస్ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'మన సంస్కృతి సమగ్రత కోసం – దేశం యొక్క శ్రేయస్సు కోసం' థీమ్‌తో వారోత్సవాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

అయోడిన్ ఉప్పుతో మేథోశక్తి వృద్ధి



కాలనీలో ప్రదర్శన నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ జ్యోతి

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి

విశాఖ విద్య: అయోడిన్ కలిగిన ఉప్పును వినియోగించడం ద్వారా మేథోశక్తి పెంపొందించుకోవచ్చని ఐసీడీఎస్ సింహాచలం సెక్టార్ సూపర్ వైజర్ జ్యోతి అన్నారు. జీవీఎంసీ 52వ వార్డు గౌరీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గర్భిణులు, బాలింతలకు అయోడిన్ ఉప్పు వినియోగం, దాని వల్ల ఉపయోగాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సూపర్ వైజర్ జ్యోతి మాట్లాడుతూ గర్భం దాల్చిన నాటి నుంచి ఆరోగ్య సంబంధిత విషయాలపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు తగినంత అయోడిన్ ఉప్పు వేసిన పదార్థాలు తినాలన్నారు. ఆరోగ్యవంతంగా ఉంటేనే సుఖ ప్రసవం జరిగి, తల్లీ–బిడ్డ క్షేమంగా ఉంటారన్నారు. ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే వైద్య సిబ్బంది వద్ద వ్యాధి నిరోధక టీకాలు తప్పకుండా వేయించుకోవాలన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ నుంచి కాలనీలో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త జె.మూర్తి, ఏఎన్ఎం శ్యామల, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'హార్ట్'ఫుల్ ఆర్టిస్ట్



పెయింటింగ్ చేస్తున్న కృష్ణదేవ్

- కాంట్రాక్ట్ కార్మికుడి సేవా నిరతి
- ప్రతి నెలా జీతం నుంచి కొంత మొత్తం కేటాయింపు

మల్కాపురం: ఆయన చిత్రకారుడే కాదు, సమాజ సేవకుడు కూడా. తన జీతం నుంచి ప్రతి నెలా కొంత పేదల సేవలకు వినియోగిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. చెల్లూరి కృష్ణదేవ్ జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం సమీపంలోని ప్రకాష్‌నగర్ వద్ద కుటుంబ సభ్యులతో కలసి నివసిస్తున్నారు. డిగ్రీ పూర్తి చేసుకున్న ఆయన ప్రస్తుతం కోరమాండల్ సంస్థలో కాంట్రాక్ట్ కార్మికుడిగా చేస్తున్నారు. చిత్రలేఖనంపై మక్కువతో స్కూల్ స్థాయి నుంచే తన నోట్ పుస్తకాలలో స్వాతంత్ర్య పోరాట యోధుల చిత్రాలను, ఇతర చిత్రాలను కూడా గీస్తుండేవారు.



కార్గో నౌకల నమూనాలను తయారుచేస్తున్న కృష్ణదేవ్

కృష్ణదేవ్ శ్రద్ధను గమనించిన తండ్రి చెల్లూరి భాస్కరరావు తన కుమారుడిని ప్రోత్సహించాడు. భాస్కరరావు కూడా స్వతహాగా చిత్రకారుడు కావడంతో ఆయన స్ఫూర్తితో మరింత శ్రద్ధగా మెలకువలు నేర్చుకున్నారు. నగరంలో జరిగిన వివిధ చిత్రలేఖన పోటీలలో పాల్గొని అనేక బహుమతులను



ఫుట్‌పాత్‌పై ఉన్న మానసిక రోగికి గెడ్డం గీస్తున్న కృష్ణదేవ్

పొందారు. మంచి శిల్పి కూడా కావడంతో సబ్బులతో దేవుని రూపాలను, చెక్క ముక్కలతో పలు యుద్ధ, కార్గో నౌకల నమూనాలను తయారు చేశారు. వాటిని చూసి, పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు తమ ఇంట్లో పెట్టుకునేందుకు నౌకల నమూనాలను తయారు చేయించుకుంటున్నారు.

సేవాస్ఫూర్తి

కృష్ణదేవ్ సేవల్లోనూ ముందుంటున్నారు. తన జీతంలో కొంత మొత్తాన్ని భిక్షాటన చేసుకునే వారికి, మానసిక రోగుల కోసం ఖర్చు చేస్తున్నారు. జీతం వచ్చిన మరుసటి రోజే వెళ్లి, ఆ సమయంలో రోడ్డుపై ఉన్న మానసిక రోగులకు తన మిత్రుల సాయంతో వస్త్రాలను మార్చడం, గెడ్డం గీయడం, జుట్టు కత్తిరించడం వంటివి చేస్తున్నారు. వారికి భోజనం, అల్పాహారం అందిస్తున్నారు. సేవలో ఎంతో సంతృప్తి ఉందని, జీవన పర్యంతం సేవలు చేస్తూనే ఉంటానని తెలిపారు.

ట్యాంక్ పెట్టారు. కనెక్షన్ మరిచారు

ఫోకస్

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డులోని గుల్లలపాలెం వాకింగ్ పార్కుకు రోజు వందల సంఖ్యలో వాకర్స్ వస్తుంటారు. అయితే వీరికి తాగునీటి సౌకర్యం లేకపోవడంతో పలువురు వాకర్స్ ఏడాది కిందట జీవీఎంసీ ఉన్నతాధికారులకు వినతులు అందజేశారు. వారు స్పందించి గతేడాది నవంబర్ నెలలో పార్కులో వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేశారు. దాని పక్కనే కొన్ని రోజుల తర్వాత పైపులైన్ వేశారు.ఈ పైపు నుంచి ట్యాంక్ లోకి నీరు వెళ్లాల్సి ఉంది.



వాకింగ్ పార్కులో అలంకారప్రాయంగా వాటర్ ట్యాంక్

అయితే కనెక్షన్ ఇవ్వకపోవడంతో ట్యాంక్ అలంకార ప్రాయంగా ఉంది. సమస్యను వాకర్స్ మరలా అధికారులకు వివరించినా నేటికీ స్పందన లేదు.

అర్ధరాత్రి వ్యక్తిపై దాడి

- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

మల్కాపురం:విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న వ్యక్తిపై ఇద్దరు యువకులు దాడి చేసి గాయపరిచారు.ఈ ఘటనపై బాధితుడు మల్కాపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు..గుజరాత్ రాష్ట్రానికి చెందిన సూరజ్ అనే వ్యక్తి ఉపాధి నిమిత్తం కొన్నేళ్ల కిందట 60వ వార్డు పరిధి ఎక్స్ సర్వీస్‌మెన్‌కాలనీకి వచ్చాడు. ఇక్కడే స్థానికంగా గల ఓ బేకరీలో మేకర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో ఎక్స్‌సర్వీస్‌మెన్‌కాలనీ డౌన్‌లో మద్యం సేవించి ఉన్న ఇద్దరు యువకులు సూరజ్‌ను అడ్డుకుని ఏ ప్రాంతం..ఎక్కడ నివాసం ఉంటున్నావు అని అడిగారు. దీనికి సూరజ్ హిందీలో బదులు ఇవ్వడంతో వెంటనే పిడి గుద్దులు గుద్దారు. ముఖం నుంచి రక్తకారడంతో సాయం చేయాలని గట్టిగా అరిచాడు. దీంతో దాడి చేసిన యువకులు అక్కడ నుంచి పరార్ అయ్యారు. మల్కాపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు అదే రోజు రాత్రి ఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు.గాయపడిన సూరజ్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పరారీలో ఉన్న యువకుల కోసం గాలిస్తున్నారు.

కార్తీక శోభ

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- భక్తిశ్రద్ధలతో కార్తీక దీపారాధన

విశాఖ విద్య: కార్తీక మాసం ప్రారంభంతో శనివారం శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయాలను దర్శించుకొని స్వామి వారికి భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయ ప్రాంగణాల్లో కార్తీక దీపాలను వెలిగించారు. ఎన్‌ఏడీ సెంటర్‌లోని ప్రమథ ఉమావిశ్వేశ్వర స్వామికి పంచామృతాలతో అభిషేకం జరిపించారు. సుసర్లకాలనీలోని పార్వతీ చంద్రమౌళీశ్వర స్వామి వారి ఆలయంలో విశేష పూజలు జరిపించారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్ర ఇచ్చారపు, మందపాటి శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

- మర్రిపాలెం వుడా లే అవుట్‌లోని వరసిద్ధి వినాయక ఆలయంలో కార్తీక దీపారాధన చేసిన అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ దాడి సూర్యనారాయణ, జాయింట్ సెక్రటరీ డాక్టర్ శిరీష, సభ్యులు రత్నకుమారి, సునీత పాల్గొని



పూజలందుకున్న చంద్రమౌళీశ్వరస్వామి

ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆలయ అర్చకులు స్వామి వారి ఆశీర్వచనాలు అందజేసి, ప్రసాదాలను పంపిణీ చేశారు.

- గోపాలపట్నం చంద్రమౌళీశ్వర ఆలయం, 89వ వార్డు కొత్తపాలెంలోని సంతోష్ నగర్, నాగేంద్ర కాలనీ శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.



ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

14 కేజీల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం : అక్రమంగా తరలిస్తున్న 14 కేజీల గంజాయిని విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకుని, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జీఆర్పీ, ఆర్పీఎఫ్ ఉన్నతాధికారుల ఆదేశాలతో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్పీ ఎస్ఐ ఎస్‌కే అబ్దుల్ మారుఫ్, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ చిట్టిబాబు సిబ్బందితో విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో శనివారం తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన గడదేస గణపతి అక్రమంగా తరలించేందుకు తీసుకొచ్చిన 14 కేజీల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని రిమాండు నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

నైపుణ్యాభివృద్ధితోనే ఉత్తమ అవకాశాలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నారాయణరావు

మురళీనగర్ : విద్యార్థులు తమ రంగానికి సంబంధించి నైపుణ్యాలు మెరుగుపరచుకున్నప్పుడే ఉన్నత అవకాశాలు లభిస్తాయని కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు సూచించారు. బిల్డింగ్ రెజీలియస్ అండ్ కోపింగ్ స్కిల్స్ ఫర్ సక్సెస్ ఇన్ ఎడ్యుకేషన్ అండ్ లైఫ్ సంస్థ ప్రతినిధి డాక్టర్ జయపూజిత అధ్యక్షతన నైపుణ్యాల సాధనపై శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మంచి మిత్రులతో స్నేహం చేయడం వల్ల జ్ఞాన సంపద పెరుగుతుందన్నారు. చెడు సావాసాలకు దూరంగా ఉండాలన్నారు. డాక్టర్ జయపూజిత మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. భవిష్యత్‌లో నిర్దేశిత లక్ష్యాలు సాధించాలంటే క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌వీ రమణ, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

కార్తీకంలో శివుడిని పూజిస్తే మంచి ఫలాలు



ఏకేసీకాలనీ రామాలయంలో ఆకాశదీపాన్ని వెలిగిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింధియా: కార్తీక మాసంలో శివుడిని పూజిస్తే మంచిఫలితం వస్తుందని జీవీఎంసీ 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు అన్నారు. ఏకేసీకాలనీలోని రామాలయంలో శనివారం ఆకాశ దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు నరసింహమూర్తి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ పితృదేవతల కోసం ఆలయాల్లో ఆకాశ దీపాన్ని వెలిగిస్తారన్నారు. ఆకాశదీపం శివకేశవులకు తేజస్సును అందిస్తుందని, సమాజంలో అజ్ఞానపు చీకట్లను తొలగించి, ఆధ్యాత్మిక జ్యోతి ప్రజ్వలనం కోసం ఆకాశదీపాన్ని సమర్పిస్తారని తెలిపారు. ప్రజలంతా దేవాలయాల్లోనే కాకుండా ప్రతి ఇంట్లో కూడా ఆకాశదీపాన్ని వెలిగించాలని కోరారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.